సాక్షి
కుమురం భీం
ఆదివారం । 19 । మార్చి । 2023



సమస్యలపై చర్చ..

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు అన్ని మండలాల్లో శనివారం సమావేశాలు నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. 9లో▸

రేపు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

కాగజ్‌నగర్‌రూరల్‌: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలకు నిరసనగా కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు పాల్వాయి హరీశ్ బాబు తెలిపారు. ఈ ధర్నాకు నిరుపేదలు అధిక సంఖ్యలో తరలిరావాలని శనివారం ఆయన పిలుపునిచ్చారు.

గరిష్టం/కనిష్టం
29.5/18.8

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావంతో చాలాప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పశుమిత్రలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: పశుమిత్రలకు పనికి తగిన వేతనాలు చెల్లిస్తూ, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని పశుమిత్రల సంఘం నాయకులు కమల, రజిత కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీఆర్‌డీవో సురేందర్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుమిత్రలకు వేతనాలు నిర్ణయించి, గుర్తింపు కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. యూనిఫాంలు, గ్లౌజ్‌లు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో శ్యామల, సుశీల, సునీత, తార, భాగ్యలక్ష్మి, సరిత, వాణిశ్రీ, మీర ఉన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

ఆసిఫాబాద్‌రూరల్‌: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ శ్రీనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్‌: సీపీఐ(ఎం) పార్టీ అఖిల భారత కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 29 వరకు నిర్వహించే జన చైతన్యయాత్ర పోస్టర్‌ను శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు రవికుమార్ మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, రాజ్‌కుమార్, అల్లూరి లోకేశ్, జాదవ్ రాజేందర్, గొడిసెల కార్తీక్, పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డిబార్



మోడల్ స్కూల్‌లో పర్యవేక్షిస్తున్న డీఐఈవో శ్రీధర్ సుమన్

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలో కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షల్లో శనివారం ఓ విద్యార్థి డిబార్ అయినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. శనివారం మొత్తం 4,743 మంది విద్యార్థులకు 4,582 మంది హాజరు కాగా, 161 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 4,046 మందికి 3,930 హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 697 మందికి 652 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో ఓ విద్యార్థిని ఫ్లయింగ్ స్క్వాడ్ మాల్‌ప్రాక్టీస్ కింద డిబార్ చేసినట్లు డీఐఈవో పేర్కొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్‌: పంచాయతీరాజ్ శాఖ ద్వారా అర్హులైన వారికి శనివారం జిల్లా కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, డీపీవో రమేశ్ ఆఫీస్ సబార్డినేటర్‌లుగా కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఎంపికైన వారు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రత్నమాల, సూపరింటెండెంట్ తోటాజీ పాల్గొన్నారు.



గంగాపూర్ ప్రాజెక్టు నిర్మిస్తున్న ప్రదేశం

నిర్మిస్తారా.. వదిలేస్తారా?

- ఎటూ తేలని గంగాపూర్ ప్రాజెక్టు భవితవ్యం
- అర్ధంతరంగా నిలిచిన నిర్మాణ పనులు
- 1,300 ఎకరాలకు సాగు నీరందేదెప్పుడో..?
- భూసేకరణలో తీవ్ర జాప్యం

రెబ్బెన(ఆసిఫాబాద్): వందల ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో మంజూరు చేసిన గంగాపూర్ ప్రాజెక్టు నిర్మాణ పనులపై స్పష్టత కరువైంది. ప్రాజెక్టు పూర్తి చేస్తారో.. లేక అలాగే వదిలేస్తారో ప్రభుత్వం ఎటూ తేల్చడం లేదు. భూసేకరణ సమస్యతో కొన్నేళ్ల క్రితం పనులు అర్ధాంతరంగా నిలిచిపోగా అప్పటి నుంచి ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయ లోపంతోనే భూసేకరణ ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. ఫలితంగా ప్రాజెక్టు పనుల పేరుతో ప్రభుత్వం ఇప్పటికే రూ.కోట్లు కుమ్మరించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

రూ.23.75 కోట్లకు చేరిన అంచనా వ్యయం..

2008లో అప్పటి ప్రభుత్వం సుమారు రూ.16.25 కోట్లతో గంగాపూర్ ప్రాజెక్టును మంజూరు చేసింది. ఆపై ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు నిర్మిత ప్రదేశాన్ని సందర్శించి ప్రాజెక్టు డిజైన్‌ను మార్చారు. దీంతో అంచనా వ్యయం రూ.23.75 కోట్లకు చేరింది. 2010లో ప్రారంభమైన నిర్మాణ పనులు ఇప్పటివరకు పూర్తి కాలేదు. స్పిల్‌వే పనులు తుదిదశకు కూడా చేరకపోయినా ప్రభుత్వం ఇప్పటివరకు ప్రాజెక్టు కోసం రూ.15కోట్ల వరకు ఖర్చు చేసింది. నంబాల వాగుపై ఈ ప్రాజెక్టును నిర్మించి, సుమారు 1,300 ఎకరాలకు సాగునీటిని అందించాలని ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఈ ప్రాజెక్టు భవితవ్యం పూర్తిగా ప్రశ్నార్థకంగా మారింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో భాగంగా వాగుకు అడ్డంగా 325 మీటర్ల పొడవు, సుమారు 7 మీటర్ల ఎత్తుతో స్పిల్‌వేను నిర్మించాల్సి ఉంది. 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులకు ముందుగానే భూమిని సేకరించలేదు. భూయజమాని అభ్యంతరం కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అయితే రెండేళ్ల క్రితం సదరు యజమాని తన భూమిలో ప్రాజెక్టు నిర్మాణ పనులు సాగించేందుకు అంగీకార పత్రం అందించినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇప్పటివరకు జరిగిన నిర్మాణ పనులకు ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌కు రూ.11 కోట్ల వరకు చెల్లించినట్లు సమాచారం.

అయోమయంలో అన్నదాతలు

గంగాపూర్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి కదలిక లేకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు. ప్రాజెక్టు కోసం 127 ఎకరాల భూమి అవసరం ఉండగా, గతంలోనే అధికారులు 117 ఎకరాలను అప్పటి రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పరిహారం అందజేశారు. అయితే ప్రాజెక్టు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడం, అసలు ప్రాజెక్టును పూర్తి చేస్తారో లేక మధ్యలో అలాగే వదిలేస్తారో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా గతంలోనే ప్రాజెక్టు కోసం భూములు అప్పగించిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ముంపు భూములకు ఆనుకుని ఉన్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం ప్రాజెక్టు పరిసరాల్లో ఎకరానికి కనిష్టంగా రూ.8 లక్షల నుంచి గరిష్టంగా రూ.40 లక్షల వరకు పలుకుతోంది. ప్రాజెక్టు పూర్తయితే తాము భూములు అప్పగించినందుకు విలువ ఉంటుంది కానీ ప్రాజెక్టును అలాగే వదిలేసి తమకు అన్యాయం చేయడం సరికాదని ముంపు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1,300 ఎకరాలకు సాగు నీరు

గంగాపూర్ ప్రాజెక్టు పూర్తయితే ఐదు పంచాయతీల పరిధిలో సుమారు 1,300 ఎకరాలకు సాగు నీరందే అవకాశం ఉంది. రెబ్బెన మండలంలోని నంబాల, గంగాపూర్, లక్ష్మీపూర్, పాశిగాం, ధర్మారం గ్రామాల్లోని భూములకు కాలువల ద్వారా సాగు నీరందించేలా ఇరిగేషన్ అధికారులు ఈ ప్రాజెక్టును రూపొందించారు. స్పిల్‌ను పూర్తి చేసేందుకు, కాలువ నిర్మాణానికి కావాల్సిన భూమిని సేకరించి నిర్మాణాలు పూర్తి చేస్తే ప్రస్తుతం వర్షాలపై ఆధారపడిన భూములన్నీ సాగునీటితో సస్యశ్యామలంగా మారుతాయి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేక పనులు ముందుకు సాగడం లేదు. గంగాపూర్ ప్రాజెక్టు నుంచి 9.5 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకానికి 30 ఎకరాల భూమి ముంపునకు గురవుతుంది. గతంలోనే సర్వేను పూర్తి చేసినా భూసేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయడంలోనూ అధికారులు జాప్యం చేస్తున్నారు.



స్పిల్‌వే నిర్మించాల్సిన ప్రాంతం

పచ్చదనం అగ్నికి ఆహుతి



ఈ ఫొటోలో కాలిపోయి కనిపిస్తున్న మొక్కలు తిర్యాణి మండలం కన్నెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలోనివి. ఇటీవల ప్రకృతి వనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి మొక్కలు కాలిపోగా మరికొన్ని వేడికి మాడిపోయాయి.

రెబ్బెన మండలం కొత్తగూడ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. రూ.లక్షల ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలపై అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మొక్కలు కాలిపోయాయని స్థానికులు ఆరోపించారు.





నాగేపల్లిలో కాలిపోయిన మొక్కలు

- పల్లె ప్రకృతి వనాల్లో వరుస అగ్ని ప్రమాదాలు
- మంటలకు కాలిపోతున్న పచ్చని మొక్కలు
- గ్రామాలకు దూరంగా నిర్మించడంతో పర్యవేక్షణ కరువు
- నిర్వహణ గాలికొదిలేసిన అధికారులు
- జిల్లాలో 1,100 పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు

కౌటాల(సిర్పూర్): గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలు నిర్వహణ లేక అధ్వానంగా మారుతున్నాయి. వేసవిలో మొక్కలు, చెట్లకు నీరు పట్టాల్సిన నిర్వాహకులు వాటిని పట్టించుకోవడం లేదు. చెట్లు ఎండిపోవడంతోపాటు పిచ్చిమొక్కలు, గడ్డి విపరీతంగా పెరుగుతోంది. అగ్ని ప్రమాదాల్లో చెట్లు కాలిపోతుండటంతో రూ.లక్షల నిధులు వృథా అవుతున్నాయి. పల్లెలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. ఉపాధిహామీ నిధులతో ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు పూల మొక్కలతోపాటు నీడనిచ్చే మొక్కలు నాటారు.

గ్రామాలకు దూరం..

జిల్లాలో చాలా వరకు పల్లె ప్రకృతి వనాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. అవి ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. అధికారులు సైతం వీటివైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా కొన్ని ప్రకృతి వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. ఊరికి దూరంగా ఉండడం, ప్రజలు వినియోగించుకోకపోవడంతో ఎక్కడా పచ్చదనం కనిపించడం లేదు. జిల్లాలో మొత్తం 335 గ్రామ పంచాయతీల పరిధిలో 1,100 వరకు పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వందల మొక్కలు నాటి కంచెలు వేసి సంరక్షిస్తున్నారు. మొక్కలకు రోజుల తరబడి సక్రమంగా నీళ్లు పట్టకపోవడం, సంరక్షణ చర్యలు తీసుకోకపోవడంతో కొన్నినెలలకే ఎండిపోయి ఆ స్థలమంతా ఖాళీగా దర్శనమిస్తోంది. మరికొన్ని వనాల్లో విపరీతంగా గడ్డి పెరిగింది. ఎండిన ఆకులు, మొక్కలు, గడ్డితో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగియడంలో రైతులు పత్తి చేలలోని చెత్తాచెదారం పోగు చేసి కాల్చేస్తున్నారు. ఈ మంటలు గాలికి ప్రకృతి వనాలకు అంటుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల సంఘటనలు

- ఈ నెల 2న రెబ్బెన మండలం తుంగెడ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో అగ్ని ప్రమాదం జరిగింది. మొత్తం 70 శాతానికి పైగా మొక్కలు కాలిపోయాయి.
- 5న రెబ్బెన మండలం కొత్తగూడ గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. వనంలోని 80శాతం మొక్కలు మంటలకు మాడిపోయాయి.
- 13న తిర్యాణి మండలం కన్నెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు మంటలు అంటుకుని 50 శాతానికి పైగా కాలిపోయాయి.
- 15న కౌటాల మండలం నాగేపల్లి గ్రామంలో గల పల్లె ప్రకృతి వనంలో మంటలు చెలరేగాయి. 70శాతం వరకు మొక్కలు కాలిపోయాయి.

మొక్కల సంరక్షణకు చర్యలు

పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కల సంరక్షణపై అధికారులు దృష్టి సారించాలని ఇటీవల ఆదేశాలు జారీ చేశాం. ఎండిన గడ్డిని తొలగించి మొక్కలకు నీళ్లు పట్టాలని సూచించాం. సమీపంలోని రైతులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తాం. ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయినా.. అగ్ని ప్రమాదాలు జరిగినా పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటాం.

– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

రంజాన్ ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పక్కన అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లాలో రంజాన్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయ్, అదనపు ఎస్పీ(ఏఆర్) భీంరావుతో కలిసి ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టి, విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాలని సూచించారు. డ్రెయినేజీల శుభ్రత, వాహనాల పార్కింగ్, రంజాన్ కిట్ల పంపిణీ, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఇతర సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల పరిధిలోని మసీదుల వద్ద సాయంత్రం పూట పారిశుద్ధ్య పనులను చేపట్టే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. ముస్లిం పెద్దలు పండుగను సమన్వయంతో ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, మైనార్టీ సంక్షేమ అధికారి షేక్ మహమ్మద్, డీపీవో రమేశ్, డీఆర్‌డీవో సురేందర్, జెడ్పీ సీఈవో రత్నమాల, డీపీఆర్‌వో కృష్ణమూర్తి, తహసీల్దార్లు, మసీదు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జైలు జీవితం ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలి

ఆసిఫాబాద్‌అర్బన్‌: జైలు జీవితం ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సబ్ జైలును శనివారం ఆయన సందర్శించారు. జైలు పరిసరాల్లో తిరుగుతూ ఖైదీలకు అందిస్తున్న ఆహార వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకుని భవిష్యత్తులో పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలన్నారు. చట్టాల గురించి తెలుసుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడంతోనే నేరాల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. మద్యం, మత్తు పదార్థాలు తీసుకోవడంతో మానసిక పరిస్థితి అదుపు తప్పుతుందన్నారు. మత్తు పదార్థాలు, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట న్యాయవాదులు నరహరి, విద్యాసాగర్, జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

- అమలుకాని నిషేధం
- జిల్లా కేంద్రంలో పేరుకుపోతున్న వ్యర్థాలు
- నియంత్రణపై దృష్టి సారించని అధికారులు

ఆసిఫాబాద్: జిల్లాలో ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు దృష్టి సారించకపోవడతో ప్రజలు, వ్యాపారులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. మహాత్మాగాంధీ 150వ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రభుత్వం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆలోచన ఉన్నతంగా ఉన్నా జిల్లాలో మాత్రం ఆచరణ సాధ్యం కావడం లేదు. అడపాదడపా అధికారులు తనిఖీ నిర్వహించడం, మొక్కుబడిగా జరిమానా విధించడంతోనే సరిపోతోంది.

పెరిగిన వినియోగం..

గతంలో ప్రజలు కిరాణా సామాన్లతోపాటు సామగ్రి, కూరగాయల కొనుగోలుకు బట్ట సంచులు వినియోగించే వారు. మారుతున్న పరిస్థితుల ప్రభావంతో సంచుల వినియోగం తగ్గి ప్లాస్టిక్ కవర్ల వాడకం పెరిగింది. ఫలితంగా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు మారుమూల ఏజెన్సీ గ్రామాల్లోని కిరాణా, జనరల్, బట్టల దుకాణాల్లో కూడా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతోనే ప్లాస్టిక్ వాడకం పెరిగింది. దశలవారీగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని భావించిన ప్రభుత్వం అక్టోబర్ 27 నాటికి సమూలంగా నిషేధించాలనే సంకల్పంతో పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. అయినా ఆశించిన మార్పు కానరావడం లేదు. ప్లాస్టిక్ కవర్లు వందల ఏళ్లపాటు భూమిలో కలిసి పోకుండా ఉంటాయి. పర్యావరణాన్ని హాని కలిగించే 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్‌పై నిషేధం ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు తరచూ జిల్లా కేంద్రంలోని వ్యాపార సముదాయాల్లో తనిఖీలు నిర్వహించి, పలువురికి జరిమానా సైతం విధించారు. అయినా పరిస్థితిలో మార్పు రావడం లేదు.



జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రమాదకరంగా చెత్తాచెదారం

జిల్లాలో 335 గ్రామ పంచాయతీలతోపాటు ఒక మున్సిపాలిటీ కాగజ్‌నగర్ ఉంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో వ్యాపార సముదాయాలు అధికంగా ఉన్నాయి. మండలాల నుంచి ప్రజలు సరుకుల కొనుగోలు కోసం ఇక్కడికే వస్తుంటారు. ప్రతిరోజూ జిల్లాలో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. హోటళ్లు, దుకాణాలు, జనరల్ స్టోర్లు, బట్టల దుకాణాలు, కూరగాయల వ్యాపారులతో పాటు చిరు వ్యాపారులు సైతం కవర్లనే వాడుతున్నారు. ఇటీవల జిల్లా అధికారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా విధించి చేతులు దులుపుకున్నారు. నిరంతర నిఘా కొరవడడంతో వ్యాపారులు నిషేధిత ప్లాస్టిక్ వాడకం ఆపడం లేదు. పలుచగా ఉండే ప్లాస్టిక్ కవర్లను రీసైక్లింగ్ చేసే అవకాశం లేకపోవడంతో భవిష్యత్‌లో ఇవి ప్రమాదకరంగా మారనున్నాయి. భూసారం కోల్పోవడంతో మానవాళితోపాటు జంతువులు ఆహారంతోపాటు తిని మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు చెత్తకుండీలు, డ్రెయినేజీల్లో పేరుకుపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. కాడ్మియం వంటి బరువైన ధాతువులతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

లక్షలాది మంది నిరుద్యోగులకు నష్టం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్‌: ప్రశ్నాపత్రాల లీకేజీతో రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 2016లో సింగరేణి జూనియర్ అసిస్టెంట్ పేపర్, 2019లో ఎంసెట్ పేపర్ లీక్ అయ్యాయని ఆరోపించారు. ఇప్పుడు టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీతో 30 లక్షల మంది నష్టపోయారన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని, లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, ఉపాధ్యక్షులు ముత్తు అశోక్, కోశాధికారి అరుణ్‌లోయా, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు రాజేందర్, మహేశ్వరచారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

క్లుప్తంగా

'హెచ్‌ఎమ్మెస్ గెలిస్తేనే సమస్యలు పరిష్కారం'

శ్రీరాంపూర్: వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్‌ఎమ్మెస్ గెలిస్తేనే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని యూనియన్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికుల కోసం నిరంతరంగా పనిచేసే సంఘం తమదేనని చెప్పారు. ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ రెండు సంఘాలు ఒకటేనని, ఆయా సంఘాల నాయకులకు పైరవీలు చేసుకోవడం మినహా కార్మికుల సమస్యలు పట్టవని ఆరోపించారు. తమ పోరాటం ఫలితంగానే ఎస్సార్పీ–3 గని ప్రమాద మృతుడు ఒంటిల కృష్ణారెడ్డి కొడుకుకు కారుణ్య ఉద్యోగం లభించిందని తెలిపారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు అనిల్‌రెడ్డి, దుర్గం లక్ష్మణ్, తన్వీర్, దుర్గం వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌నగర్‌లో చోరీ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్‌ఐ

రామకృష్ణాపూర్: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాలో చోరీ జరిగింది. కాలనీకి చెందిన అడ్వకేట్ యుగంధర్ ఇటీవల మృతిచెందగా అతడి భార్య కుటుంబసభ్యులతో కలిసి ఇదే ప్రాంతంలోని సమీప బంధువుల ఇంటికి శుక్రవారం నిద్ర నిమిత్తం వచ్చింది. శనివారం ఉదయందఇంటికి వచ్చి చూడగా ముందు తలుపులు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన సుమారు ఏడు తులాల బంగారం, రూ.3లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించిన ఆమె పోలీసులకు సమాచారం అందించింది. ఘటనాస్థలిని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్‌ఐ అశోక్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక సోలార్ వెలుగులు

- శివలింగాపూర్ సమీపాన సోలార్ పవర్ ప్లాంట్‌కు స్థలం కేటాయింపు
- డిసెంబర్‌లోపు పనుల పూర్తికి సన్నాహాలు



ప్రతిపాదిత స్థలంలో ఏర్పాటు చేసిన స్తంభాలు

చెన్నూర్‌రూరల్: సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సౌర వెలుగులు విరజిమ్మనున్నాయి. మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో మూతపడ్డ బొగ్గుగని వద్ద సోలార్‌ప్లాంట్ నిర్మాణానికి సంస్థ స్థలం కేటాయించింది. 55 ఎకరాల్లో చేపట్టనున్న 11 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయింది. సుమారు రూ.67 కోట్లతో చేపట్టనున్న ప్లాంట్ నిర్మాణ పనులను పూణెకు చెందిన ఎన్‌రిచ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. వాస్తవానికి 2020లోనే అదాని ఇన్‌ఫ్రా ప్రైవేట్ కంపెనీవారు సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. పనులు ప్రారంభించేందుకు ఇక్కడ స్థలాన్ని కూడా చదును చేయించారు. వివిధ కారణాలతో ఆ కంపెనీతో ఒప్పందం రద్దు కాగా సింగరేణి అధికారులు మళ్లీ టెండర్ ప్రక్రియ నిర్వహించారు. దీంతో ఎన్‌రిచ్ కంపెనీ పనులను దక్కించుకుంది. ఇప్పటికే ప్రహరీ నిర్మాణానికి స్థలాన్ని చదును చేశారు. ప్లాంట్ నిర్మాణ స్థలంలో స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. డిసెంబర్ కల్లా పనులు పూర్తి చేయనున్నట్లు సమాచారం. ఇక్కడ ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సింగరేణి విద్యుత్ కేంద్రం 132 కేవీకి అందించనుంది. ప్లాంట్ నిర్మాణ సమయంలో, పూర్తయ్యాక స్థానికులకు ఉపాధి లభించే అవకాశముంది.

పనులు త్వరగా పూర్తి చేయాలి

శివలింగాపూర్ సమీపంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. డిసెంబర్‌లోపు పనులు పూర్తి చేయాలని సూచించాం. పనులు పూర్తయిన వెంటనే విద్యుదుత్పత్తిని ప్రారంభిస్తాం.

– సంజీవరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా జీఎం

వెలుగులోకి మరో అక్రమ పట్టా

- అధికార పార్టీ నాయకులు భూఆక్రమణ
- బయటకు తీయాలంటున్న గ్రామస్తులు

జన్నారం: మండలంలోని సింగరాయిపేట సీలింగ్ భూమి అక్రమ పట్టా విషయం మరువక ముందే మరోచోట అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకుల అక్రమ పట్టా వ్యవహారం బయటకు వచ్చింది. సింగరాయిపేటకు చెందిన సీలింగ్ భూమిని అధికార పార్టీకి చెందిన ఇద్దరు వారి కుమారుల పేరిట అక్రమంగా పట్టా చేయించుకున్న విషయం సంచలనం సృష్టించింది. తాజాగా జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు రెండు చోట్ల ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న విషయం బయటకు వచ్చింది. వివరాలు.. జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 30గుంటల చెరువు భూమిని ఓ ప్రజాప్రతినిధి వారి కుటుంబ సభ్యుల పేరిట, 6.13 ఎకరాల భూమిని మరొకరి పేరిట అక్రమంగా పట్టా చేయించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అలాగే మరో ప్రజాప్రతినిధి ఒకడుగు ముందుకేసి రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా పట్టా చేయించుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయగా విషయం బయటకు వచ్చింది.

అసలు ఆ భూమి ఎక్కడిది?

కిష్టాపూర్ గ్రామ శివారులోని చెరువుకు సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన సామ హన్మంతు గతంలో ప్రభుత్వానికి ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చెరువులోని 7.03 ఎకరాల భూమిని ఇద్దరి పేరిట ప్రజాప్రతినిధి అక్రమంగా పట్టా చేయించుకున్నట్లు ఆరోపిస్తున్నారు. అలాగే కిష్టాపూర్ గ్రామ శివారులో ఆరెకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. ఇందులో కొంత కేజీబీవీకి, మరికొంత పల్లె ప్రకృతి వనానికి, మరో రెండెకరాలు గతంలో ఐటీఐ కళాశాలకు కేటాయించారు. ఐటీఐ కళాశాల నిర్మాణం రద్దు కాగా, సదరు భూమి అలాగే ఉండిపోయింది. అదే భూమిని కిష్టాపూర్ గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి తమ కుటుంబ సభ్యుల పేరిట అక్రమంగా పట్టా చేయించుకున్నట్లు గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. గతంలో అన్నం ఆది నారాయణ ప్రభుత్వానికి తన భూమి అప్పగించినట్లు తెలిపారు. ఆ భూమిని ఇప్పుడు అక్రమంగా పట్టా చేయించుకోగా యువకులు గట్టు మహేశ్, నరేశ్, సాయి, దేవేందర్ స్థానిక తహసీల్దార్ వెంకటకిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. ఈ విషయంపై ఆది నారాయణ అనే వ్యక్తికి గ్రామస్తులు ఫోన్ చేయగా, ఆ భూమి తాను ప్రభుత్వానికి ఇచ్చానని, వేరే వారి పేరిట ఎలా పట్టా అవుతుందని ఆయన అన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై తాను తహసీల్దార్ కార్యాలయానికి పిలిచినప్పుడు రావడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

విచారణ జరిపిస్తాం

కిష్టాపూర్ చెరువు భూమి, ప్రభుత్వ భూమి అక్రమంగా పట్టా అయినట్లు మా దృష్టికి వచ్చింది. గ్రామానికి చెందిన పలువురు యువకులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఇదివరకే చెరువు భూమి సర్వే కోసం పంపగా నీరు ఉండడంతో సర్వే చేయలేకపోయాం. మరోసారి విచారణ చేపట్టి పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– వెంకటకిషన్, తహసీల్దార్

25, 27 తేదీల్లో ఇఫ్టూ రాష్ట్ర మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర తొమ్మిదో మహాసభలను ఈనెల 25, 27 తేదీల్లో మంచిర్యాలలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా తెలిపారు. శనివారం బెల్లంపల్లిలోని సింగరేణి సివిక్ కార్యాలయ ఆవరణలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికవర్గ ప్రయోజనాలు ప్రధాన లక్ష్యంగా ఇఫ్టూ పని చేస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించడంలో ఇఫ్టూ ముందంజలో ఉందన్నారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణపై నిరంతర పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాయడానికి కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, ప్రధాని మోదీ కార్మిక చట్టాలను విభజించి హక్కులను హరించి వేయడానికి కంకణం కట్టుకున్నారని విమర్శించారు. సింగరేణి, బీడీ, మోటార్స్, హమాలీ తదితర అసంఘటిత కార్మికుల పక్షాన పోరు సాగిస్తున్న ఘనమైన చరిత్ర తమ సంఘానికి ఉందని చెప్పారు. మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నాయకులు కృష్ణవేణి, శ్యామ్, రాములు, రవి, అబ్దుల్లా, మనోహర్, చంద్రకళ, అమృత, పవన్, వెంకటేశ్, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు సింగరేణి చేయూత



విజేతలకు బహుమతి ఇస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి యాజమాన్యం క్రీడలకు పూర్తి స్థాయిలో చేయూతనందిస్తోందని శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా డబ్ల్యూపీఎస్, జీఏ వార్షిక క్రీడా బహుమతి ప్రదానోత్సవాన్ని శుక్రవారం రాత్రి శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో చాలామంది ప్రావీణ్యంగల క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. వారు కోలిండియా స్థాయిలోనూ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించి కంపెనీకి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా కొన్ని నెలల క్రితం నిర్వహించిన వార్షిక కీడల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదిర్, ఎస్వోటూ జీఎం త్యాగరాజు, డీవైసీఎంవో రమేశ్‌బాబు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్, జనరల్ కెప్టెన్ రిక్కుల గోపాల్, టీబీజీకేఎస్ నాయకుడు పెట్టం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నరికివేతకు గురవుతున్న చెట్లు



లంబడిపల్లి సమీపంలో నరికివేతకు గురైన చెట్లు

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి సమీపంలోని ఎల్లక్కపేట శివారులో ప్రభుత్వ దసిలిపట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రం ఉంది. ఇందుకు ఏరుమద్ది చెట్లు పెంచేందుకు 306 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. 91ఎకరాలు సెంట్రల్ సిల్క్ బోర్డుకు, 206 ఎకరాలు రాష్ట్ర పట్టు పరిశ్రమల శాఖకు కేటాయించింది. పట్టు గూళ్ల పెంపకంపై అనేక మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో రాష్ట్ర పట్టు పరిశ్రమకు సంబంధించిన భూమిలో ఏరుమద్ది చెట్లు పెంచారు. ఈ చెట్లు ఇప్పుడు నరికివేతకు గురవుతున్నాయి. కొందరు పట్ట పగలే చెట్లు నరికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. భూమి ఆక్రమించుకునేందుకే పలువురు చెట్ల నరికివేతకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మన ఊరు–మనబడి పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్



రికార్డులు తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలంలోని కోటేశ్వర్‌రావుపల్లె గ్రామాన్ని శనివారం అడిషనల్ కలెక్టర్ రాహుల్, అసిస్టెంట్ కలెక్టర్ గౌతమి సందర్శించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మన ఊరు–మనబడి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

మందమర్రిరూరల్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ సూచించారు. శనివారం మండలంలోని పొన్నారం ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలను ట్రైనీ కలెక్టర్ గౌతమితో కలిసి ఎంపీడీవో శశికళ, సర్పంచ్ లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామపంచాయతీల రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. మండల పంచాయతీ అధికారి బీరయ్య తదితరులున్నారు.

కూల్చివేసిన చోటే అక్రమ కట్టడం



నస్పూర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

నస్పూర్: పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేయగా కొందరు వ్యక్తులు కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు చేపట్టారు. సీతారాంపల్లి శివారు సర్వే నంబర్ 22లో కొందరు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారని గత మంగళవారం రెవెన్యూ అధికారులు జేసీబీ సాయంతో వాటిని తొలగించారు. అయినప్పటికీ కొందరు తిరిగి మళ్లీ అదేచోట కబ్జాకు పాల్పడి నిర్మాణాలు చేపట్టారు. వీటిని తొలగించి విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జ్యోతిని సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు. ఆర్ఐ మాంతయ్యని సంప్రదించగా తహసీల్దార్ మీటింగ్‌లో ఉన్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాల విషయం తమ దృష్టికి వచ్చిందని, త్వరలో చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఇందారంవాసికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా



గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న రఘునాథరావు

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన వై.రఘునాథరావు శనివారం హైదరాబాద్ జేఎన్టీయూలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అందుకున్నారు. రఘునాథరావు కొంతకాలంగా హైదరాబాద్‌లోని దుండిగల్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ)లో అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్, పౌరసంబంధాల అధికారిగా పని చేశారు. జేఎన్టీయూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్ డాక్టర్ పార్వతి పర్యవేక్షణలో సమకాలీన భారతదేశం పరిస్థితులు, ఉపమన్యు చటర్జీ, అమిత్ ఘోష్ నవలలో ప్రచరితమైన అంశాలపై పరిశోధన విజయవంతంగా పూర్తి చేసి జేఎన్టీయూకు సమర్పించిన నేపథ్యంలో ఈ పట్టాను అందజేశారు.

రేపు నేషనల్ అప్రెంటిషిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 20న ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా కంపెనీల్లో 235 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. టాటా ఏరో స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఫిట్టర్–50, టర్నర్–30, మెషినిస్ట్–20, టీవీఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఫిట్టర్–30, ఎంఎస్ రాని బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఎలక్ట్రీషియన్–60, ఫిట్టర్–30, వెల్డర్–10, వినయ్ ఆటో టెక్నాలజీలో డీజిల్ మెకానిక్ ఐదు ఖాళీలున్నాయని తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 20న హాజరుకావాలని, పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికల్లోపు కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు టీ రాజారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఎస్సార్పీ–1గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఈ సమస్యలను ఎన్నికలకు ముందు పరిష్కరించకుంటే.. గెలిచాకే తామే పరిష్కరిస్తామని కొన్ని సంఘాలు ఓట్ల కోసం కార్మికులను నమ్మించి మోసం చేసే ప్రమాదముందని చెప్పారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించకుండా ఎన్నికలకు వెళ్లరాదని అన్ని సంఘాలను కోరుతున్నట్లు తెలిపారు. యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు మిడివెల్లి శంకర్, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, నాయకులు సుధాకర్, కస్తూరి చంద్రశేఖర్, శ్రీనివాస్, అజయ్, గంగాధరాచారి, రాజేశం పాల్గొన్నారు.

అనారోగ్యం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మకు చెందిన జాజూరి రాజయ్య (80) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య కొంత కాలంగా ఆస్తమాతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. మూడు, నాలుగు రోజులుగా ఆస్తమా ఎక్కువైంది. బాధ భరించలేక శనివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే రాజయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు సత్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



పాపయ్య (ఫైల్)

దహెగాం: మండలంలోని చంద్రపల్లి గ్రామానికి చెందిన ఓ కూలీ ఆచూకీ లభించడంలేదు. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపల్లి గ్రామానికి చెందిన ఆత్రం పాపయ్య (34) అత్తగారి ఊరైన కుంచవెల్లిలో నివాసముంటూ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంచిర్యాల, గోదావరిఖని ప్రాంతాలకు కూలీ పనులకు వెళ్లి నాలుగైదు నెలలకోసారి ఇంటికి వచ్చేవాడు. కాగా, ఏడాదిగా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య పార్వతి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదానికి కారణమైన ఒకరిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్–3 గ్రామానికి చెందిన సరోజిత్ మండల్‌ను శనివారం ద్విచక్ర వాహనంతో ఢీకొట్టిన సిర్పూర్ (టీ) మండలం హీరాపూర్ గ్రామానికి చెందిన దుమ్మ ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. విలేజ్ నంబర్–1లోని తన సోదరుడు కృష్ణకాంత్‌కు పాలు పోసేందుకు వచ్చిన సరోజిత్‌ను అతివేగంగా ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలయ్యాడని పేర్కొన్నారు. సరోజిత్‌ను చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. అతడి సోదరుడు కృష్ణకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కనీస వేతనమివ్వాలని వినతి



రాహుల్‌కు వినతిపత్రం ఇస్తున్న పశుమిత్రలు

పాతమంచిర్యాల: జీవో 60 ప్రకారం తమకు కనీస వేతనమివ్వాలని జిల్లా పశుమిత్ర వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత, కార్యదర్శి సునీత డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రికి వినతిపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాము ఎనిమిదేళ్లుగా వేతనం లేకుండా పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తంజేశారు. తమను ప్రభుత్వం గుర్తించడంలేదని వాపోయారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు లావణ్య, రాజేశ్వరి, స్వప్న, మల్లేశ్వరి, శ్రీలత, సరోజ, నీరజ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కౌటాల: గురుడుపేట వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుండాయిపేట గ్రామానికి చెందిన యూ బిక్కజీకి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కజీ ఈజ్‌గాం గ్రామంలో శుభకార్యానికి హాజరై ద్విచక్ర వాహనంపై గుండాయిపేటకు వెళ్తున్నాడు. గురుడుపేట వద్ద రోడ్డుపై ఇసుక ట్రాక్టర్ ట్రాలీ టైర్ పంచర్ కావడంతో దానిని రోడ్డుపైనే నిలిపి ఉంచారు. రాత్రి ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించపోయి రోడ్డుపై నిలిచి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని బిక్కజీ ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బిక్కజీ తలకు బలమైన గాయాలు కాగా చికిత్స కోసం అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

న్యాయశాఖ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా ఉమేశ్‌రావ్



ఉమేశ్‌రావును సన్మానిస్తున్న న్యాయవాదులు

మంచిర్యాలక్రైం: జిల్లా న్యాయశాఖ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా ఎం.ఉమేశ్‌రావ్‌ను ఎన్నుకున్నట్లు ఏవో రామబ్రహ్మాచారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో శనివారం న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా జాఫర్, ప్రధాన కార్యదర్శిగా వైఎస్.సంపత్, జాయింట్ సెక్రటరీగా నస్పూరి శ్రీనివాస్, ట్రెజరర్‌గా ఏ విజయ్‌కుమార్, మహిళా రిప్రజెంటేటివ్‌గా మంజుల, ఈసీ మెంబర్స్‌గా లింగమూర్తి, కవిత, దుర్గం వేణుగోపాల్, బీ చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఉమేశ్‌రావును సన్మానించారు.

ఈతకు వెళ్లి యువకుడి దుర్మరణం

తానూరు: ఈతకు వెళ్లి బావిలో మునిగి యువకుడు మృతి చెందాడు. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మహ్మద్ జీయా (30) రెండు రోజుల క్రితం తానూరులోని అత్తగారి ఇంటికి వచ్చాడు. శనివారం స్థానికులతో కలిసి ధర్మాబాద్ రోడ్డులో ఉన్న వ్యవసాయ బావికి ఈత నేర్చుకోవడానికి వెళ్లాడు. ట్యూబ్ సాయంతో ఈత కొడుతుండగా అది జారిపోయి బావిలో మునిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా పాంఢ్రకొడ తాలుకా చిన్నార్లిలో నివాసముంటున్న అడెల్లు (40) ఈనెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడు కొద్దిరోజులుగా తాగుడుకు బానిసై ఎలాంటి పనులు చేయడం లేదు. మద్యం మత్తులో పురుగుల మందు తాగినట్లు కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కెరమెరి: పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని గోయగాం, కెరమెరి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా పేరెంట్స్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని వారి తల్లిదండ్రులకు వివరించారు. ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: కెనరా బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రీజనల్ కార్యాలయం డివిజనల్ మేనేజర్ రాఘవేంద్ర కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో కెనరా బ్యాంకు బ్రాంచీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ వంశీకృష్ణ, సిబ్బంది హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

పెంచికల్‌పేట్: ఎల్లూర్ గ్రామంలో శనివారం సెయింట్ క్లారెట్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫాదర్స్ సిబి, డోమినిక్, థామస్, జోసెఫ్, ప్రిన్సిపాల్ అనిష్, ఎస్సై విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

కౌటాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ప్రథమ సంవత్సరం పరీక్షకు 362 మంది విద్యార్థులకు గాను 342 మంది హాజరయ్యారు. 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని సీఎస్ స్వరూప, డీవో సునీత తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వాంకిడి: పాటగూడ గ్రామ పంచాయతీలోని ఎనోలి గ్రామంలో శనివారం సీసీరోడ్డు పనులను జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద రూ.5లక్షల నిధులతో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టు, ఉప సర్పంచ్ బాపురావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: జంబుగ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ శ్రీనివాస్, రూరల్ ఏఈ జగన్మోహన్ తెలిపారు. దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలతోపాటు జంబుగ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఫిరోజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతోపాటు అంకుసాపూర్ నుంచి మోవాడ్ వరకు గల గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముస్లిం వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం

ఆసిఫాబాద్‌అర్బన్: ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సొసైటీ చీఫ్ అడ్వైజర్లు మీర్ సాబిర్ అలీ తెలిపారు. అడ్వైజర్లుగా ఖలీద్ బిన్ అవద్, సమీ ఉల్‌హక్, ఫైసల్, జావిద్, గౌరవ అధ్యక్షులుగా అబ్దుల్ వహీద్, అబ్దుల్లా, నిసార్, సాజిద్, అధ్యక్షుడిగా ఉబేద్ బిన్ యాహియా, ఉపాధ్యక్షులుగా జావిద్, అహ్మద్, తాజ్, ఇమ్రాన్, సలీం, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రహమాన్, సహాయ కార్యదర్శులుగా ఇమ్రాన్, షాకీర్, నజీర్, మొహ్మద్, రియాజ్‌ఖాన్, కోశాధికారిగా అబ్దుల్ రబ్‌ను ఎన్నుకున్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దహెగాం: రాబోయే రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, పంటలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో వంశీకృష్ణ సూచించారు. మండల కేంద్రంతోపాటు ఐనం, పెసరికుంట గ్రామాల్లోని పంటలను శనివారం పరిశీలించారు. చిరుజల్లు కురుస్తున్నందున ఆరబెట్టిన మిర్చి, శనగ, కంది పంటలు తడవకుండా అందుబాటులో టార్పాలిన్లు ఉంచుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏఈవో శోభన్ రైతులు ఉన్నారు.

సమస్యలపై చర్చ.. అభివృద్ధిపై సమీక్ష

- జిల్లా వ్యాప్తంగా మండల సమావేశాలు
- అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇక నుంచి ప్రతినెలా మొదటి, మూడో శనివారం నిర్వహణ

క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, మండల స్థాయిలో వాటిని పరిష్కరించేందుకు కలెక్టర్ హేమంత్ బొర్కడే ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో శనివారం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొని సమస్యలపై చర్చించారు.



వాంకిడిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అజయ్‌కుమార్

అభివృద్ధికి పాటుపడాలి

వాంకిడి: అధికారులు, ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి పాటుపడాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇక నుంచి ప్రతీ మొదటి, మూడో శనివారం నిర్వహించే సమావేశాలకు ప్రతిఒక్కరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో శివకుమార్, వైద్యాధికారి వినయ్, సీడీపీవో రెబ్కా, అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి వెంకటేశ్

కెరమెరి: వేసవిలో నీటి సమస్య ఏర్పడే గ్రామాలను తక్షణమే గుర్తించాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెద్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలోని పాటగూడ, చాల్‌బాడి, లైన్‌పటార్ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, వెంటనే గ్రామాలను సందర్శించి సమస్య పరిష్కరించాలన్నారు. ముకదంగూడలో అంగన్‌వాడీ ఉద్యోగి సక్రమంగా విధులకు రావడం లేదని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొమ్మిది గ్రామాల్లో 4,653 మందికి నేత్రపరీక్షలు చేశామని, 540 మందికి రీడింగ్ గ్లాసులు అందజేశామని వైద్యాధికారి వెంటేశ్ తెలిపారు. అధికారులు ఆయా శాఖల ప్రగతి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఏఈలు విశ్వేశ్వరరావు, స్టీవెన్, ఈసీ ఐక్యానాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత

పెంచికల్‌పేట్: మండల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ జాజిమొగ్గ సుజాత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం విద్య, వైద్య, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన మండలంలో సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అధికారులు తమ నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. ఎంపీడీవో గంగాసింగ్, ఏఈలు కృష్ణారావు, మనోహర్, వైద్యాధికారి అమన్, సర్పంచులు సంజీవ్, కమల, సుధాకర్, ఎంపీటీసీ రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: అధికారులు అందుబాటులో ఉండి మండల అభివృద్ధికి సహకరించాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్పంచులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. మండల కేంద్రంలో లోటట్టేజ్‌తో మైనార్టీ కాలనీ, ప్రగతి నగర్‌లలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, సర్పంచులు అహల్యాదేవి, పోషమల్లు, మల్లేశ్, కార్తీక్, శ్రీకాంత్, డాక్టర్ సుజిత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సోనీ, ట్రాన్స్‌కో ఏఈ ఇమ్రాన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ విశ్వనాథ్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో కన్నెపల్లిలో ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ దుర్గం మోతిరాం ఏఈ రవీందర్‌ను కోరారు. నాగేపల్లి, గుండాయిపేట, గోవర్‌హెట్టి, మొగడ్‌దగడ్ గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని కార్యదర్శులు సభాదృష్టికి తీసుకువచ్చారు. సాండ్‌గాం లిఫ్ట్ ఇరిగేషన్ వినియోగంలో లేకపోయినా రూ.6 కోట్ల కరెంట్ బిల్లు వచ్చిందని సర్పంచ్ దామోదర్ తెలిపారు. వైగాం, సైదాపూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని సర్పంచ్ రాందాస్ పేర్కొన్నారు. కన్నెపల్లి, కౌఠి, సాండ్‌గాం, గిన్నెలహెట్టిలో నీటి సరఫరాలో లీకేజీ సమస్యలు ఉన్నాయన్నారు. ఉపాధి పనుల్లో ఆన్‌లైన్ హాజరు కారణంగా కూలీలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కూలీలు పనులకు చాలా తక్కువగా రావడం లేదని తెలిపారు. అనంతరం వైద్యశాఖ సూపర్‌వైజర్ పవని మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ వ్యాధి చాపకింద నీరులా సోకుతుందని, నిర్ధారణ వైద్య పరీక్షల కోసం ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతినెలలో మొదటి శనివారం, మూడో శనివారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంఈవో సోమయ్య, ఏపీఎం వెంకటరమణ, ఏఈవో ఘనశ్యాం, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాలికల భద్రతపై అవగాహన కల్పించాలి

కెరమెరి: ఉపాధ్యాయులు బాలికల భద్రతపై తమ పాఠశాలల్లో వారం రోజులపాటు అవగాహన కల్పించాలని మోడి, అనార్‌పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రేంసింగ్, వసంత్‌రావు, రిసోర్స్ పర్సన్లు చంద్రశేఖర్, శ్యాంరావు అన్నారు. మండలంలోని ఆయా పాఠశాలల సముదాయ సమావేశాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ బాలికల భద్రతపై పుస్తకం ముద్రించి, పలు అంశాలపై అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ సేఫ్టీ క్లబ్ అనే పుస్తకాన్ని విడుదల చేశారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

రెబ్బెన: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు శ్రమించాలని నవేగాం సర్పంచ్ వడాయి మాధవి అన్నారు. కస్తూరిబా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నవేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 40 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదో తరగతిలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఫౌండేషన్ అందజేస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కైరిగాం సర్పంచ్ కార్తీక్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శంకర్, దిలీప్, హెచ్‌ఎం ప్రవీణ్, సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: కెనరా బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ రీజనల్ కార్యాలయం డివిజనల్ మేనేజర్ రాఘవేంద్ర కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో కెనరా బ్యాంకు బ్రాంచీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ వంశీకృష్ణ, సిబ్బంది హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దహెగాం: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కంబగౌని సులోచన అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

రూ.30వేల విరాళం

రెబ్బెన: రాళ్లపేటలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబాదేవీ, సేవాలాల్ గుడిలో విగ్రహాల కోసం శనివారం దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దారావత్ ప్రవీణ్ రూ.30వేల విరాళం అందించారు. సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ రవినాయక్, గ్రామ పెద్ద శంకర్ నాయక్, ప్రేందాస్, ధనునాయక్, మురళీధర్‌కు నగదును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, వసంత్‌రావు, బాబురావు, తిరుపతి, శివాజీ, రమేశ్, దేవాజీ, రాములు, అమర్‌సింగ్, సంతోష్, తుల్సీరాం పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రశ్నాపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు పోల్కర్ సాయిరాం డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శనివారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడికి యత్నించగా పలువురు టీఎస్ఎస్ఎఫ్ నాయకులు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకుడు చౌహాన్ పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలోని కట్టమైసమ్మ ఆలయంలో శనివారం కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సతీమణి రమాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛరణాల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, కుంభాభిషేకం, హారతి మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు హరీశ్‌బాబు, కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు రావి శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కచ్చకాయల అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అందించే వరకు పోరాడాలి



నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

రెబ్బెన: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం కనీస వేతనాలు అందించే వరకు కార్మికులు పోరాడాలని గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్మికుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలను చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనంగా రూ.26వేల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ఓదెలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మండల అధ్యక్షుడిగా రాచకొండ రమేష్, ప్రధాన కార్యదర్శిగా రత్నం దేవయ్య, కోశాధికారిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, కొండు లక్ష్మి, మహేందర్, సహాయ కార్యదర్శిగా ధర్మయ్య, రెడ్డి రాజేశ్వరి, శంకర్, కమిటీ సభ్యులుగా దుర్గ, శ్రీనివాస్, తదితరులను ఎన్నుకున్నారు.

వీవోఏలను పట్టించుకోరా?

- సేవలందిస్తున్నా వేతనాల్లేవ్.
- పనిభారంతో సతమతం
- సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు
- మూడు రోజులుగా టోకెన్ సమ్మె



జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న వీవోఏలు

పనిభారంతో సతమతమవుతున్నా.. సహనంతో సేవలందిస్తున్నా ప్రభుత్వం ఐకేపీ విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు(వీవోఏలు) అవస్థలను పట్టించుకోవడం లేదు. డ్వాక్రా సంఘాలు ఏర్పడిన తొలినాళ్ల నుంచి నేటికీ వారికి తగిన గౌరవ వేతనం చెల్లించడం లేదు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనాన్ని వెంటనే అమలు చేయడంతోపాటు తమ డిమాండ్లు నెరవేర్చాలని జిల్లాలోని వీవోఏలు మూడు రోజుల టోకెన్ సమ్మె చేపట్టారు.

కౌటాల: స్వయం సహాయక సంఘాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా సమన్వయం చేయడంలో వీవోఏల పాత్ర ముఖ్యం. సభ్యుల్లో క్రియాశీలకంగా ఉన్న ఒకరిని ఎంపిక చేసి ఈ బాధ్యతలు అప్పగిస్తారు. పొదుపు సంఘాల కార్యకలాపాల్లో పనిచేసే వీవోఏ, పట్టణ రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లకు ప్రతినెలా చెల్లించే గౌరవ వేతనం తక్కువగా ఉంది. పొదుపు సంఘాల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు కావడంతో ఆర్థిక లావాదేవీలు, నెలవారీ సమావేశాలు తీర్మానాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయడం, బ్యాంకు అధికారులతో మాట్లాడి పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించడం లాంటి కీలక పనులను వీవోఏలు, ఆర్పీలు నిర్వహిస్తుంటారు. ఇంత కష్టం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వీవోఏలు ఆరోపిస్తున్నారు.

ఏళ్లుగా వెట్టిచాకిరీ!

పొదుపు సంఘాలకు సంబంధించిన పనులు, పుస్తకాలు రాయడం, మినిట్స్ బుక్స్, వేలిముద్రలు తీసుకోవడం, ఆన్‌లైన్ వర్క్‌లు అప్‌లోడ్ చేయడం ఇలా అదనపు పనిభారాన్ని వీవోఏలపై మోపుతున్నారు. నయా పైసా ఇవ్వకుండా ఏళ్లుగా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పైపెచ్చు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేసిన వారికి మాత్రమే జీతాలు.. మిగతా వారికి నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి పనుల్లో వీరి సేవలను అధికారులు వినియోగించుకుంటున్నారు.


జిల్లాలో 398 మంది వీవోఏలు..

జిల్లాలో మొత్తం 398 మంది వీవోఏలు ఉన్నారు. వందశాతం ఆన్‌లైన్ వర్క్ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం రూ. 3900 మాత్రమే గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. పేదరికంలో ఉన్న మహిళలను గత 20 ఏళ్లుగా పోగుచేసి సంఘాలు ఏర్పాటు చేసిన ఐకేపీ వీవోఏలకు ప్రభుత్వం గౌరవ వేతనం సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపిస్తున్నారు.

డిమాండ్లు..

తమ డిమాండ్లు నెరవేర్చాలని వీవోఏలు ఆందోళన చేస్తున్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.26 వేలు, యూనిఫాంతోపాటు రూ. 10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలి. ఆన్‌లైన్ పనులు రద్దుతోపాటు సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలి. మహిళా సంఘాల సభ్యులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించాలి. సంఘాలకు బ్యాంక్ వీఎల్ఆర్ డబ్బులు ఇవ్వాలి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



20 ఏళ్లుగా మహిళా సంఘాల అభివృద్ధికి పాటుపడుతున్నాం. ప్రభుత్వం కనీస గౌరవ వేతనం ఇవ్వడం లేదు. ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

– ఎల్ములే దత్తు, వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

వేతనాలు పెంచాలి

ఐకేపీ సంఘాల్లో కీలకంగా విధులు నిర్వహిస్తున్న వీవోఏల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవాలి. ఎన్నో ఏళ్లుగా తక్కువ వేతనానికి పని చేస్తున్నాం. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం వేతనాలు పెంచాలి.

– మహేశ్వరి, వీవోఏ, ముత్తంపేట్

అటెన్షన్ ప్లీజ్.. పిచ్చిమొక్కలు తొలగించరూ..!



వాంకిడి: మండలంలోని వెల్గి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయింది. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: నితేశ్, పంచాయతీ కార్యదర్శి, వెల్గి ఫోన్: 70950 17978